# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | ఆదివారం 11 ఆగస్టు 2024 | తెలుగు దినపత్రిక




## కేరళకు అండగా ఉంటాం..

- సహాయ పునరావాసానికి నిధులు ఇస్తాం
- ప్రధాని నరేంద్ర మోడీ
- వయనాడ్ లో ఏరియల్ సర్వే
- హెలికాప్టర్ నుంచి విలయ ప్రాంతాల వీక్షణ
- అన్ని విధాల ఆదుకుంటామని కేరళ ప్రభుత్వానికి హామీ

2




# నిన్న ముద్దు.. నేడు వద్దు..

## టార్గెట్ మేఘా..!

- సుంకిశాల తెచ్చిన లొల్లి..
- బ్లాక్ లిస్ట్.. బ్లాక్ మెయిల్ బాగోతం
- నాసిరకం పనులంటూ మండిపాటు..
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పనులు
- బీఆర్ఎస్ సహాయంలో లక్షల కోట్ల కాంట్రాక్టులు..
- అధికారం మారగానే స్వరం మార్చిన బీఆర్ఎస్

**జనపదం, బ్యూరో:** స్వరం మారింది. పని విధానంపై అనుమానాలు కట్టలుకట్టలుగా బయటకు తన్నుకొస్తున్నాయి. అప్పుడేమో తెల్లని కాగితం వంటి అభిమానమున్న సంస్థగా కనిపిస్తే.., ఇప్పుడు మసిపూసి మారేడు చేస్తుందనేంతగా శంకించేలా తోస్తోంది. సన్నని పొర ఎందుకు తొలగింది., వీరు వారు అయినంతలోనే వారు వీరుగా ఎందుకు మారారు. మోఘా అంటే మనోడేగా అన్నంతగా ఫ్రీపబ్లిసిటీ ఇచ్చిన రోజుల నుంచి ఇప్పుడు ఆ మాటెత్తితేనే కడుపు కములుతున్న వాసనేంటి...? అవసరం తీరేదాకా మంచోళ్లుగా అనిపించిన వారు, తీరాక చెడ్డోళ్లయ్యారా.. లేదంటే ప్రజల సొమ్ము గంగపాలు అవుతోందని నిజంగానే బాధతో నిలదీస్తున్నారని భావించాలా.? ఎన్ని చేసినా పలు రాష్ట్రాల్లో ఇంకా ఆ సంస్థకే పనుల్లో అగ్రతాంబూలం దక్కుతున్నట్టు తీక్షణగా చూసే వారికెవరికైనా తెలుస్తోంది.., మరీ అదే పార్టీ నేతల్లోనే సంస్థ పనులపై అనుమానాలను పట్టించుకోని విధానాన్ని ఏమనాలి..? ఏదిఏమైనా బీఆర్ ఎస్ కు అధికారం మారగానే స్వరం మారిన తీరుపై అంతా విమర్శలు గుప్పిస్తున్నారు. అప్పుడు ఆ సంస్థవారంటే భలే.. భలే... అని జబ్బలు చరుచుకున్న వారు ఇప్పుడెందుకు ముక్కు విరిస్తున్నారో..? నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్ వద్ద నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ కుప్పకూలడం సంచలనం రేపుతోంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు

.......(తరువాయి 2లో)



## లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

జోయిటిస్ కంపెనీ విస్తరణకు ప్రభుత్వ సహకారం..

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**సెప్టెంబర్ నుంచి జోయిటిస్ కార్యకలాపాలు**

**అమెరికాలో సీఎంతో భేటీ అయిన కంపెనీ ప్రతినిధులు**

**70 ఏళ్లుగా జంతువుల ఆరోగ్యంపై పరిశోధనలు చేస్తున్న జోయిటిస్..**

**జనపదం, బ్యూరో:** ప్రపంచంలో ప్రముఖ జంతు ఆరోగ్య సంస్థగా పేరొందిన జోయిటిస్ (Zoetis Inc.) కంపెనీ హైదరాబాద్‌లో తమ కెపాబులిటీ సెంటర్ ను విస్తరించాలని నిర్ణయించింది. 2024 సెప్టెంబర్ నుంచి ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని నిర్ణయించింది. దీంతో వందలాది మందికి కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. హైదరాబాద్‌లోని జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించనున్నట్లు ప్రకటించింది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారుల బృందంతో కంపెనీ ప్రతినిధులు సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్‌ను విస్తరించే నిర్ణయాన్ని సీఎం స్వాగతించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ తెలంగాణలో కొత్త ఆవిష్కరణలకు, వ్యాపార వృద్ధికి అపారమైన అవకాశాలున్నాయన్నారు. హైదరాబాద్ ను

......(తరువాయి 2లో)

## హైదరాబాద్‌లో ఆరమ్ ఈక్విటీ

**రూ.3350 కోట్లు పెట్టడానికి నిర్ణయం..**

**ఏఐ ఆధారిత గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు**

2



## కేటీఆర్‌కు జైలు ఖాయం..

- రేవంత్ పై నమ్మకం..
- కేటీఆర్ అరాచకాలు అందరికీ తెలిసిందే..
- బీఆర్ఎస్ చర్చలు పచ్చి అబద్ధం..
- కవిత బెయిల్ కు, బీజేపీకి ఏం సంబంధం..
- అధ్యక్ష మార్పు మా పార్టీ పెద్దలు చూసుకుంటారు..
- కేంద్ర మంత్రి బండి సంజయ్ చిట్ చాట్

2



## ఇల్లు పాయె.. గుడిసె పాయె

- కేసీఆర్ ఊరోళ్లనే మోసం చేసిండు..
- డబుల్ బెడ్రూం అని ఉన్న ఇండ్లు పీకేసిండు..
- చింతమడకలో ఇడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం..
- మాజీ సీఎంపై మంత్రి పొంగులేటి ఫైర్


3


## బాబు గారు.. మళ్లొచ్చారు..

**రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి పావులు..**

- ఎన్టీఆర్ భవన్ లో పార్టీ నాయకులతో సమావేశం..
- జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు..
- బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలకు కసరత్తు..
- పార్టీకి పాత బలాన్ని ఆపాదించడానికి కేడర్ కు దిశానిర్దేశం..
- త్వరలోనే రాష్ట్రపార్టీకి కొత్త సారథి.. - వివరాలు 2లో

బాబూ మళ్లీ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గతంలోనే వచ్చెళ్లిన ఆయన శనివారం మరోమారు హైదరాబాద్ వచ్చారు. ఏపీలో పిచ్చ ఫామ్ లో ఉన్న పార్టీని తెలంగాణలో కూడా గాడిలో పెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరంచేస్తున్నారు. క్షేత్రస్థాయి నుంచి కమిటీలు వేసి స్థానిక పోరులో తమ పూర్వపు బలాన్ని బయటకు తీసేందుకు పావులు కదుపుతున్నారు. ఒకప్పటి తెలుగు దేశం నేతలంతా చెట్టుకొకరు, పుట్టకొకరుగా అయిన సందర్భంలో పాత పరిస్థితులను తీసుకొచ్చేందుకు బాబు చేస్తున్న ప్రయత్నాలు ఎంతమేరకు ఫలప్రదమవుతాయో చూడాలి మరీ...






## కోర్టు చెప్పినా.. చలనం రాదా..?

కుక్కల దాడులపై హరీష్ రావు ఫైర్..

- సర్కార్ నిర్లక్ష్యంపై మండిపాటు..
- పారిశుధ్యం అధ్వానమని ఆందోళన..
- వరంగల్, నార్సింగ్ ఘటనలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆగ్రహం..
- ఎనిమిది నెలల్లో 343 ఘటనలు..



**జనపదం, హైదరాబాద్ :** రాష్ట్రంలో వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోకపోవడం అత్యంత దారుణం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీధి కుక్కల దాడులపై పలుమార్లు హైకోర్టు హెచ్చరించి నా కాంగ్రెస్ సర్కార్ మొద్దు నిద్ర వీడట్లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిన్న ఒక్కరోజే వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో పసికందు మృతదేహాన్ని కుక్కలు పీక్కతినడం, హైదరాబాద్ శివారులోని నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో మరో

....(తరువాయి 2లో)

## డార్క్ వెబ్ నుంచి డ్రగ్స్..

- ఆర్డర్ చేసిన టెకీ..
- డెలివరీ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు
- హైదరాబాద్‌లో మరో డ్రగ్స్ ముఠా అరెస్ట్..
- రూ.60 లక్షల విలువైన ఎఫెడ్రిన్, సూడోఎఫెడ్రిన్ ప్యాకెట్లు స్వాధీనం
- న్యూజిలాండ్‌కు కొరియర్ చేస్తున్నట్లు గుర్తింపు..

2



## అర్హులకు రేషన్ కార్డు

గ్రామాల్లో రూ.1.5లక్షలు.. పట్టణాల్లో రూ.2లక్షల వార్షిక ఆదాయం..

**భూ పరిమితిపై కూడా ప్రతిపాదన..**

**మాగాణి 3.5 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు**

**అర్హులందరికీ అందేలా నిర్ణయాలు..**

**సమావేశమైన కెబినెట్ సబ్ కమిటీ**

**జనపథం, బ్యూరో:** ఏన్నాళ్ల నుంచే రేషన్ కార్డుల కోసం వేచి చూస్తున్న ప్రజల కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ సర్కార్ వడివడిగా అడుగులు వేస్తోంది. అర్హులందరికీ తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు విధివిధానాల ఖరారులో కేబినెట్ సబ్ కమిటీ మునిగిపోయింది. ఇందులో భాగంగా శనివారం సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఇందులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రజలందరికీ తెల్ల రేషన్ ......(తరువాయి 2లో)

# కేటీఆర్‌కు జైలు ఖాయం..

- రేవంత్ పై నమ్మకం..
- కేటీఆర్ అరాచకాలు అందరికీ తెలిసిందే..
- బీఆర్ఎస్ చర్చలు పచ్చి అబద్ధం..
- కవిత బెయిల్‌కు, బీజేపీకి ఏం సంబంధం..
- కాంగ్రెస్‌లో కదలిక మొదలైంది..
- అధ్యక్ష మార్పు మా పార్టీ పెద్దలు చూసుకుంటారు..
- కేంద్ర మంత్రి బండి సంజయ్ చిట్ చాట్

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:** 'మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జైలుకు వెళ్లడం ఖాయం., రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ పని చేస్తారనే నమ్మకం నాకుంది..' అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి సంజయ్ మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ ఆగడాలు అంతా చూశారన్నారు. తనతో సహా బీజేపీ కార్యకర్తలను కేటీఆర్ హింసించి జైల్లో వేసిన తీరు ఎవరూ మర్చిపోరన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కేటీఆర్ ను తప్పకుండా జైలులో వేస్తారనే నమ్మకం తనకుందన్నారు.

### చర్చలు ఫేక్..

బీఆర్ ఎస్ తో బీజేపీ చర్చలు జరిపిందని వస్తున్న వార్తల్లో నిజం లేదని బండి కొట్టిపారేశారు. భారత రాష్ట్ర సమితి ఒక అవుట్ డేటెడ్ పార్టీ అని దానిని ఇప్పుడు ఎవరూ పట్టించుకునే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్, బీఆర్ ఎస్ ఒక్కటైనా బీజేపీ ధాటికి తట్టుకోలేనంతగా కొట్లాడతామన్నారు. రేవంత్ ను అంతా నమ్ముతున్నారని, నమ్మాల్సిన సమయమే అని, కానీ ఒకవేళ నమ్మకం పోతే మాత్రం కాంగ్రెస్ లో తీవ్ర యుద్ధం ఖాయమన్నారు. నిజాయితీగా పనిచేసే ఐఏఎస్ లకు నేటికీ పోస్టింగ్ ఇవ్వడం లేదని, బీఆర్ఎస్ కు కొమ్ముకాసిన వారికే మళ్లీ మంచి పోస్టింగులిస్తున్నారన్నారు. కాంగ్రెస్ కు, బీఆర్ఎస్ కు తేడా లేకుండా పోయింది. కోర్టుల విషయాలను పార్టీ ఎప్పటికీ టచ్ చేయదని బండి తెలిపారు. కవిత బెయిల్ కు, బీజేపీకి ఏం సంబంధమని, సిసోడియాకు బెయిల్ వస్తే దానికి బీజేపీకి అంటగట్టడమేంటన్నారు.

### స్థానికంలో బీజేపీ, కాంగ్రెస్‌కే పోరు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని, పంచాయతీలకు నిధులిచ్చే పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు కూడా ప్రోత్సాహక నిధులివ్వడం లేదని, కేంద్ర నిధులతోనే పంచాయతీలు నడుస్తున్నాయన్నారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, జడ్పీటీసీలే మా బ్రాండ్ అంబాసిడర్లని, ఏ పార్టీ గెలిస్తే పంచాయతీలు అభివృద్ధి అవుతాయనేది గుండె మీద చేయి వేసుకుని ఆలోచించాలన్నారు. పంచాయతీలకు కేంద్రమే నిధులిస్తోందని హరీష్ రావు ఇప్పటికైనా చెప్పడం శుభ పరిణామం అని బండి పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్టు భూములు కొనుగోలు దందా బాధ్యతను కాంగ్రెస్ నేతకు అప్పగించిందన్నారు.



### తమ్ముడి కోసం వెళ్లారనడం సరికాదు

సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడి కోసమే అమెరికా వెళ్లారనడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు చేసేటప్పుడు హుందాగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ లో లుకలుకలు మొదలయ్యాయని, ఇతర పార్టీలను చీల్చి లాభం పొందాలనే ఆలోచన బీజేపీకి ఎంతమాత్రం లేదన్నారు. కాంగ్రెస్ కు ప్రజలు ఐదేళ్ల తీర్పు ఇచ్చారని, అధికారాన్ని ఉంచుకుంటారా..? వదులుకుంటారా..? అనేది ప్రభుత్వ తీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. అతి తక్కువ టైంలో ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్సే అన్నారు.

### వక్ఫ్ బోర్డు పై ఎందుకంత రాద్ధాంతం

అసదుద్దీన్ ఒవైసీ ఎన్ని వక్ఫ్ బోర్డు భూములను కాపాడారో సమాధానం చెప్పాలని, ఒకచోట ఊరు ఊరంతా వక్ఫ్ బోర్డు భూములేనని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి ఎంత మంది పేద ముస్లింలకు ఇచ్చారో కూడా చెప్పాలని, ప్రైవేట్ భూములు కూడా చాలా చోట్ల వక్ఫ్ బోర్డులో ఉన్నాయనే విషయం విచారణ చేస్తే తెలుస్తుందన్నారు. గతంలో వక్ఫ్ బోర్డు భూములను కాంగ్రెస్, ఎంఐఎం నేతలు చాలా చోట్ల కబ్జా చేశారని, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందితే నిజానిజాలు బయటకు వస్తాయన్నారు. తాను అందరి మనిషినని, కాదని ఎవరైనా అనుకుంటే దానికి తానేం చేయలేనని బండి పేర్కొన్నారు. త్వరలోనే తన పార్లమెంట్ పరిధిలో 80 శాతానికిపైగా ఓట్లు నమోదు చేయించిన పోలింగ్ బూత్ కమిటీలను సన్మానిస్తానని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్ష మార్పు జాతీయ అధ్యక్షుడు నడ్డా చూసుకుంటారని, హైకమాండ్ నిర్ణయమే తమకు ఫైనల్ అని బండి సంజయ్ వివరించారు.

# బాబు.. మళ్లొచ్చారు..

- రాష్ట్రంలో టీడీపీ బలోపేతానికి పావులు..
- ఎన్టీఆర్ భవన్ లో పార్టీ నాయకులతో సమావేశం..
- జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు
- బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలకు కసరత్తు..
- పార్టీకి పాత బలాన్ని ఆపాదించడానికి కేడర్‌కు దిశానిర్దేశం..
- త్వరలోనే రాష్ట్ర పార్టీకి కొత్త సారథి..

**జనపదం, బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఏపీలో జనసేన, బీజేపీతో జట్టు కట్టి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించిన చంద్రబాబు ఇప్పుడు తెలంగాణలో కనుమరుగైన టీడీపీని మరోసారి వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు షురూ చేశారు. ఏపీ ఎన్నికల తర్వాత సీఎం హోదాలో తెలంగాణకు వచ్చిన చంద్రబాబుకు ఘన స్వాగతం లభించింది. బేగంపేట విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు బైక్ ర్యాలీతో తెలుగు తమ్ముళ్లు స్వాగతం పలికారు. గతంలో టీడీపీలో పని చేసి ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న కాంగ్రెస్ నేతలు కూడా ఆయనను వ్యక్తిగతంగా వెళ్లి కలవటం గమనార్హం.

### బలోపేతం దిశగా పావులు..

ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో తెలంగాణలో టీడీపీ మద్దతుదారులు కూడా యాక్టీవ్ అయ్యారు. ఇదే అనువైన సమయంగా భావిస్తున్న చంద్రబాబు పార్టీని బలోపేతం చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలోనే శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. తెలంగాణ టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్న సమావేశంలో జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ, బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ కమిటీలు వేయడంపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

### కొత్త అధ్యక్షుడి కోసం..

తెలంగాణలో టీడీపీని మరోసారి వెలుగులోకి తీసుకొచ్చేందుకు సత్తా ఉన్న నేతను టీటీడీపీ కొత్త అధ్యక్షుడిగా ఎంపిక చేయాలని చంద్రబాబు భావిస్తున్నట్టు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త అధ్యక్షున్ని ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. టీటీడీపీ అధ్యక్షుడి బరిలో సీనియర్ నేతలు అరవింద్ కుమార్ గౌడ్, బక్కని నరసింహులు, సామా భూపాల్ రెడ్డి, నందమూరి సుహాసిని, కాట్రగడ్డ ప్రసూన ఉన్నట్లు వినికిడి.

### కోడలికేనా..

తెలంగాణలో పార్టీ పగ్గాలను తన కోడలు బ్రహ్మణికే ఇస్తారని సోషల్ మీడియాలో చాలా రోజులుగా ప్రచారం జరుగుతోంది. బాబు అరెస్టయిన సమయంలో ఏపీలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ఆయన కోడలు నారా బ్రాహ్మణికే పార్టీ పగ్గాలు అప్పజెప్పనున్నారంటూ తెగ ప్రచారం జరిగింది. నిజానికి అధ్యక్ష బరిలో ఉన్నది బాబుకు కోడలి వరస అయ్యే నందమూరి సుహాసిని. ఆమెకు పార్టీ అధ్యక్షురాలి బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలు ఉండగా శ్రేణులు మాత్రం బ్రాహ్మణికి ఇస్తారని ప్రచారం చేశారు.

### విమర్శలు తిప్పికొట్టే ప్రయత్నమా..

గత ఎన్నికల్లో టీడీపీ తరపున కూకట్‌పల్లి నుంచి బరిలోకి దిగిన సుహాసిని ఘోర పరాజయం పొందిన విషయం తెలిసిందే. కాగా నందమూరి కుటుంబానికి పార్టీలో సముచిత స్థానం కల్పించట్లేదంటూ వస్తున్న విమర్శల నేపథ్యంలో తెలంగాణలో నామమాత్రంగా ఉన్న పార్టీ బాధ్యతలైనా సుహాసినికి అప్పజెప్తే కొంచెమైనా విమర్శలు తగ్గే అవకాశం ఉందని బాబు భావిస్తున్నట్టుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సీనియర్ నేత అని బాధ్యతలు ఇస్తే కాసాని జ్ఞానేశ్వర్ బీఆర్ఎస్‌లో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతమున్న నేపథ్యంలో పార్టీలోని సీనియర్ నేతలకు పగ్గాలు అప్పజెప్తుతారా.. లేదా కోడలికే ఇస్తారా అన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.



### తెలుగు ప్రజల మనోభావాలే ముఖ్యం చంద్రబాబు

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభావాలే తనకు ముఖ్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. శనివారం తెలంగాణ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అవసరమైతే మరోసారి రేవంత్ రెడ్డిని కలుస్తానని కూడా పేర్కొన్నారు. రేవంత్ మార్క్ బాగుందని, తెలంగాణ అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామన్నారు. తాను విజన్ 2020 అంటే 420 అని కామెంట్ చేశారని, అయినా పట్టించుకోనన్నారు. తెలుగు ప్రజలు ఎక్కడున్నా బాగుండాలని కోరుకుంటానని, తెలంగాణ అభివృద్ధి కోసం మాట్లాడితే నువ్వు ఎవరు అని అడిగే వాళ్ళు ఉన్నా, కచ్చితంగా అడుగుతా అది తన బాధ్యత అని బాబు తెలిపారు.


## లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్

**(మొదటిపేజీ తరువాయి)** ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ హబ్ గా తీర్చిదిద్దాలనే తమ ఆలోచనలకు ఈ పెట్టుబడులు దోహదపడుతాయన్నారు. వందలాది మందికి ఉద్యోగా లు లభిస్తాయన్నారు. ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలో జోయిటిస్ రంగ ప్రవేశం హైదరాబాద్ కు మరింత గుర్తింపు తెస్తుందన్నారు. ఇండియాలో తమ కంపెనీ విస్తరణకు హైదరాబాద్ అనువైన ప్రాంతమని, తెలంగా ణ ప్రభుత్వంతో భాగస్వామ్యం కావటం సంతోషంగా ఉందని జోయిటిస్ కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సర్‌బాగ్ అన్నారు. తమ కంపెనీ విస్తరణ జంతు ఆరోగ్యానికి సంబంధించి సరి కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న ప్రపంచ స్థాయి ప్రతిభా వనరులను సద్వినియోగం చేసుకుంటామని జోయిటిస్ ఇండియా కెపాబిలిటీ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్ అన్నారు. ప్రపంచంతో పోటీ పడే సేవలందించటంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ జోయిటిస్ కంపెనీ విస్తరణ తెలంగాణ ఉన్న వనరులు, తమ ప్రభుత్వ విధానాలపై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబించిందని అన్నారు. రాబోయే సంవత్సరాల్లో కొత్త ఉద్యోగాలతో పాటు జంతు ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్లో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందన్నారు. కాగా..., జోయిటిస్ కంపెనీ దాదాపు 70 సంవత్సరాలుగా జంతువుల అనారోగ్యం, రోగ నిర్ధారణ, నిరోధించే మార్గాలు, చికిత్స సంబంధిత అంశాలపై పని చేస్తోంది.

# కేరళకు అండగా ఉంటాం..

- సహాయ పునరావాసానికి నిధులు ఇస్తాం
- విషాదం నుంచి ప్రజలు త్వరగా కోలుకోవాలి
- రోడ్లు, వంతెనలు నిర్మాణాల్లో భాగస్వాములవుతాం
- ప్రధాని నరేంద్ర మోడీ
- వయనాడ్ లో ఏరియల్

**జనపదం, బ్యూరో:** ప్రకృతి ప్రకోపంతో విధ్వంసమైన కేరళను అన్ని విధాలా ఆదుకుంటామని ప్రధాని నరేంద్ర మోడీ భరోసా ఇచ్చారు. వయనాడ్ ప్రజలు తిరిగి జనజీవనంలోకి వచ్చేందుకు అవసరమైన సాయం కేంద్రం అందిస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ కు హామీ ఇచ్చారు.. ఇటీవల వయనాడ్ లో కొండచరియలు విరిగిపడి పలు గ్రామాలు నామరూపాల్లేకుండా శిథిలమమైన ప్రాంతాల్లో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏరియల్ సర్వే నిర్వహించారు. హెలికాప్టర్ లో నుంచి చూసి చలించిపోయారు.. ఇంత తీవ్రమైన విలయం ఇంతకు ముందు ఎన్నడూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హెలికాప్టర్ సర్వే అనంతరం కాల్ పెట్ట నుంచి రోడ్డు మార్గంలో పయనించి కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలను పరిశీలించారు. రెస్క్యూ ఆపరేషన్, బాధితుల తరలింపు జరిగిన తీరును ప్రధానికి వివరించారు. అనంతరం సహాయక శిబిరాలు, ఆసుపత్రులకు వెళ్లి బాధితులను మోడీ పరామర్శించారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్య చికిత్స, సహాయ కార్యక్రమాల ఎలా సాగుతున్నా యనే విషయాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు.



### అధికారులతో సమీక్ష..

ప్రధాని మోడీ కన్నూర్ లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య మంత్రి విజయన్ కూడా పాల్గొన్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ, శిథిలాల నుంచి వెలికి తీయడంలోనూ నిరంతరం శ్రమించిన ఆర్మీ, పౌర,ప[illegible]లీస్ అధికారులను మోడీ ప్రశంసించారు.. ప్రతికూల పరిస్థితులలోనూ వేలాది మంది ప్రాణాలు కాపాడిన రెస్క్యూ సిబ్బందిని అభినందించారు. కాగా , కష్టంలో కేరళను అన్నివిధాలా ఆదుకుంటామని మోడీ హామీ ఇచ్చారు. రోడ్లు, వంతెనలు, విద్యుత్ నిర్మాణాలకు అవసరమై మేర కేంద్రం సాయం చేస్తుందని సీఎంకు చెప్పారు. అలాగే బాధితులు తిరిగి జనజీవనంలో వచ్చేందుకు వారికి కూడా తగిన సాయం అందిస్తామని అన్నారు. కేరళ ప్రజలను అదుకునేందుకు దేశ ప్రజలందరూకలిసి రావాలని మోదీ పిలుపు ఇచ్చారు. కన్నూరు విమానాశ్రయానికి చేరుకున్న మోడీకి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రధానికి స్వాగతం పలికారు. ప్రధాని వెంట కేంద్రమంత్రి సురేశ్ గోపి కూడా ఉన్నారు.

# అర్హులకే రేషన్ కార్డు

**(మొదటిపేజీ తరువాయి)** కార్డు జారీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం 1.50 లక్షలు, మాగాణి 3.50 ఎకరాలు, చెలక 7.5 ఎకరాలు ప్రామాణికంగా తెల్లరేషన్ కార్డు మంజూరు చేస్తామని చెప్పారు. ఇక పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 2 లక్షలుగా నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో భూములను కాకుండా వార్షిక ఆదాయాన్ని ఆధారంగా రేషన్ కార్డు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీలో లబ్ధిదారుల ఎంపికకు విధి విధానాల రూపకల్పనలో రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులను భాగస్వా మ్యం చేయనున్నట్లు మంత్రివర్గ ఉపసం ఘం తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ, శాసన సభ, శాసనమండలి సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. వాందరికీ సమాచారం చేరేలా లేఖలు రాయాలని అధికారులను ఆదేశించింది.

### సక్సేనా కమిటీ సిఫార్సుల పరిశీలన..

తెల్లరేషన్ కార్డుల జారీ కోసం సక్సేనా కమిటీ సిఫారసుల పరిశీలించడం, దేశంలోని మిగిలిన రాష్ట్రాల్లో తెల్ల రేషన్ కార్డుల అర్హత ప్రమాణాలను పరిశీలించాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. ఇతర రాష్ట్రాలలో తెల్ల రేషన్ కార్డు ఉండి తెలంగాణలోనూ రేషన్ కార్డు ఉంటే తీసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 89 లక్షల 96 వేల రేషన్ కార్డులు ఉండగా, సుమారు పది లక్షల దరఖాస్తులు కొత్తగా వచ్చాయని మంత్రి చెప్పారు. తెల్ల రేషన్ కార్డులలో అదనపు సభ్యులను చేర్చాలంటూ వచ్చిన దరఖాస్తుల సంఖ్య 11 లక్షల 33 వేల 881 అని మంత్రి పేర్కొన్నారు. రేషన్ కార్డుల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 956.04 కోట్లు ఖర్చవుతుందన్నారు. అర్హతలు, విధివిధానాలపై సూచనలు స్వీకరించిన తర్వాత మరోసారి సమావేశమై ఖరారు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది.

## కోర్టు చెప్పినా.. చలనం రాదా..?

**(మొదటిపేజీ తరువాయి)** దివ్యాంగ చిన్నారి మర్మాంగాలపై కుక్కల దాడి, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నాలుగేళ్ల చిన్నారి కుక్కల దాడిలో గాయాలపై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. వంటి హృదయవిధారక ఘటనలు జరగటాన్ని చూసి కూడా ప్రభుత్వం చలించకపోవడం అమానవీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.ఎనిమిది నెలల్లో 343 కుక్క కాటు ఘటనలు

కుక్క కాటు కేసులు నమోదైన మొదట్లోనే తగిన చర్యలు తీసుకొని ఉంటే గడిచిన ఎనిమిది నెలల కాలంలో 343 కుక్కకాటు సంఘటనలు జరిగి ఉండేవి కావని ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేవారు కాదని అన్నారు హరీశ్ రావు. రాష్ట్రంలో 3,79,156 వీధి కుక్కలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హైకోర్టుకు తెలిపిందని అయితే . కానీ వీటి సంఖ్య ఇంతకు రెట్టింపు ఉంటుంది అని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.

### పడకేసిన పారిశుధ్యం..

గ్రామాల్లో, పట్టణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు నిలిపివేయడం వల్ల పారిశుధ్య నిర్వహణ పడకేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు హైకోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్ర వదల డం లేదు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కుక్కకాటు దాడులు అరికట్టే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన కుక్కకాటు ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించి ప్రాణాలు కోల్పోయిన వారికి, గాయపడిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

# టార్గెట్ మేఘా..!

**(మొదటిపేజీ తరువాయి)** సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 2016లో ఈ ప్రాజెక్టును దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ వైఫల్యమే కారణమని తీవ్రంగా విమర్శలు వస్తున్నాయి. ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం జరగడం వల్లే ప్రమాదానికి కారమని అధికారులు చెబుతున్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన ఆ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### కేటీఆర్ ఫైర్..

సుంకిశాల ప్రాజెక్టు పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థను (పరోక్షంగా మేఘా ఇంజినీరింగ్ సంస్థ) బ్లాక్ లిస్టులో పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం, ముఖ్యమంత్రి రేవంత్ చేతగానితనం వల్లే ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిపోయిందని మండిపడ్డారు. హడావుడిగా పనులు చేయించడం వల్లే వాల్ కూలిందని పలువురు ఇంజినీర్లు తనతో చెప్పారని కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో సుంకిశాలకు వెళ్లి పరిశీలిస్తామని అక్కడ ఏం జరిగిందో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ప్రమాదంపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని కూడా డిమాండ్ చేశారు. వారం రోజుల పాటు ఈ ప్రమాదం బయటపడకుండా దాచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపం కోట్లాది రూపాయల ప్రజల సంపద నీట మునిగిందని మండిపడ్డారు.

### పూర్తి బాధ్యత కాంట్రాక్టు సంస్థదే..

సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా స్పందించారు. ప్రమాదంపై రిపోర్టు అందిన తర్వాత కాంట్రాక్టు సంస్థపై మేఘా ఇంజినీరింగ్ పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి బాధ్యత కాంట్రాక్టు సంస్థదేనని ప్రకటించారు. మరోవైపు మేఘా కృష్ణారెడ్డిపై ఎమ్మెల్యే, బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం మారినా పెత్తనం మాత్రం మేఘా కృష్ణారెడ్డిదేనన్నారు. ప్రాజెక్టుల్లో నాసిరకం పనులు చేసినా ఆయనకే పనులు అప్పగించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆ సంస్థకు నోటీసులు ఇచ్చింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. మేఘాను కాపాడేందుకే సుంకిశాల ప్రమాదం ఘటనను కావాలనే దాచినట్టుగా ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు.

### బ్లాక్ లిస్టులో పెట్టాలి..

మేఘా కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేస్తుండగానే బీజేపీ నేత కూడా తీవ్రంగా ధ్వజమెత్తారు. కంపెనీ దొంగ గ్యారెంటీలు పెట్టిందని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరమే లేఖ కూడా రాసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మేఘా అక్రమాలపై ఇంకా అంతకు మించిన ఆధారాలేం కావాలని నిలదీశారు. వెంటనే దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని, రాష్ట్ర సర్కార్ లేఖ ఇస్తే విచారణ చేయించే బాధ్యత తనది అని ఎమ్మెల్యే ప్రకటించారు.

### సీఎం ఎందుకు సైలెంట్ అయినట్లో..

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కూడా మేఘా సంస్థల మీద రేవంత్ ఆరోపణలు చేశారని, ఇప్పుడెందుకు కాళేశ్వరం అవినీతిని సీబీఐకి సిఫార్సు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. దానిపై కూడా రిటైర్డ్ జడ్జి తో కమిటీ వేశారని, ఆ జడ్జికీ మూడు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. అదీ కాకుండా సర్కార్ నుంచి ఆయనకి అందజేయాల్సిన కీలకమైన ఫైళ్లు కూడా ఇవ్వలేదని తెలుస్తోందని, ప్రభుత్వమే కమిటీని నీరుగార్చే పనిలో ఉన్నట్టు అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

### మేఘా దర్జా..

ప్రభుత్వమే తన జేబులో ఉందని మేఘా కృష్ణారెడ్డి దర్జాగా ఉన్నారు. అధికారంలో ఎవరు ఉన్నా తాను ఇచ్చే కమీషన్లకు లోగాల్సిందేననే ధీమాతో ఉన్నారు. అవినీతి విచారణ ఎదుర్కొంటున్న కంపెనీకే కాంట్రాక్టులు ఇస్తున్నారు. కొడంగల్ పనులు కూడా మేఘాకి ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారని సమాచారం ఉందని ఎమ్మెల్యే పేర్కొంటున్నారు. మేఘా కృష్ణా రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. మేఘా మీద ఉన్న ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించాలని, అరగంట ముందు ప్రమాదం జరిగి ఉంటే సుంకిశాలలో భారీ ప్రాణ నష్టం జరిగేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంపై విచారణ జరపాలని, బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్య మేఘా కృషా రెడ్డి సెటిల్మెంట్ చేస్తున్నారని ఆరోపించారు. మేఘా అవినీతిపై సోమవారం మరొక్కసారి ఆధారాలతో ప్రెస్ మీట్ పెడతానని కూడా ప్రకటించారు. ఆధారాలు ఎక్కడ సబ్మిట్ చేయమంటే అక్కడ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు ఎమ్మెల్యే వివరించారు. ప్రజల సొమ్మును దోచుకుంటున్న గజదొంగ సంస్థ మేఘాపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన కు వెనకాడమని, సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదంలో కేంద్రం జోక్యం చేసుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం దీనిపై లెటర్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. లెటర్ ఇస్తే సీబీఐతో విచారణ చేయించే బాధ్యత తాను తీసుకుంటానని ఏలేటీ మహేశ్వర్ రెడ్డి అన్నారు.

### ప్రాజెక్ట్ అవసరం.. నిర్మాణం..

హైదరాబాద్ మహానగర ప్రజల దాహార్తి తీర్చేందుకు నల్గొండ జిల్లా పెద్దపూర మండలంలో సుంకిశాల వద్ద నిర్మిస్తున్న ప్రాజెటులో సైడ్ వాల్ కూలిన ఘటనపై జలమండలి వివరణ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును మేఘాఇంజినీరింగ్ సంస్థ టెండర్ దక్కించుకుని, ఇన్ టెక్ వెల్ లో సంపు, పంపుహౌజ్, మూడు టన్నెళ్లు, పంప్ హౌజ్ సూపర్ స్ట్రక్చర్ ను నిర్మిస్తున్నది. సుంకిశాల ప్రాజెక్ట్ ఇన్ టెక్ వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70 శాతం, ఎలక్ట్రో మెకానికల్ పనులు 40 శాతం పూర్తి అయినట్టు జలమండలి చెప్పింది. 2021జూలైలో పనులు ప్రారంభమయ్యాయని, రిజర్వాయర్ టన్నెల్ వైపున్న సైడ్ వాల్స్ 2023 జూలైలో పూర్తి అయ్యాయని జలమండలి తెలిపింది. అదే సంవత్సరం డిసెంబర్ నాటికి నాలుగు సైడ్ వాల్స్ బ్లాకుల్లో మూడు రిజర్వాయర్ ఫుల్ లెవల్ ఎత్తు వరకు పూర్తయ్యాయని, సంపు ఫ్లోర్ లెవల్ 137 ఉండగా, 43 మీటర్ల నిర్మాణం పూర్తి చేశామని జలమండలి వివరించింది. కాగా, ఈ యేడాది జూలై 29 నుంచి మూడు రోజుల పాటు గేట్లను బిగించే పనులకు శ్రీకారం చుట్టగా నాగార్జున సాగర్ నుంచి ఒక్కసారిగా 3.5 లక్షల క్యూసెక్కుల ప్రవాహం రావడంతో నీళ్లు టన్నెల్ కు చేరడం, గేట్ ధ్వంసమవడం, అనుసంధానంగా ఉన్న సైడ్ వాల్ కూలిపోవడం కేవలం నిమిషాల వ్యవధిలోనే జరిగిందని జలమండలి వివరించింది.



## హైదరాబాద్‌కు ఆరమ్ ఈక్విటీ

- రూ.3350 కోట్లు పెట్టడానికి నిర్ణయం..
- ఏఐ ఆధారిత గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటు

**జనపదం, హైదరాబాద్ :** ప్రఖ్యాత ఆరమ్ ఈక్విటీ పార్టనర్స్ తెలంగాణలో భారీ పెట్టుబడులకు ముందుకొచ్చింది. హైదరాబాద్ లో 400 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.3350 కోట్ల పెట్టుబడులకు సిద్ధపడింది. హైదరాబాద్‌లో నెక్స్ట్-జనరేషన్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- పవర్డ్ గ్రీన్ డేటా సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది. దశల వారీగా ఈ పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ తెలిపింది. అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబుతో ఆరమ్ ఈక్విటీ సీఈవో, చైర్మన్ వెంకట్ బుస్సా సమావేశమయ్యారు. అనంతరం తెలంగాణలో తమ విస్తరణ ప్రణాళికలతో పాటు భారీ పెట్టుబడులను కంపెనీ ప్రకటించింది. గత ఏడాది ఆరమ్ ఈక్విటీ భాగస్వామ్యులు దాదాపు రూ.400 కోట్ల పెట్టుబడులకు తమ వార్షిక ప్రణాళికను ప్రకటించింది. ఇప్పుడు తమ ప్రణాళికలను భారీగా విస్తరించింది. 100 మెగావాట్ల అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ను స్థాపించాలని నిర్ణయం తీసుకుంది. దీనికి దాదాపు రూ.3350 కోట్ల పెట్టుబడులకు సిద్ధపడింది. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏఐ ఆధారిత గ్రీన్ డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవటం సంతోషంగా ఉందన్నారు. దీంతో భారీగా ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. ఆరమ్ ఈక్విటీ సంస్థ కొత్త డేటా సెంటర్ ఏర్పాటును మంత్రి శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇప్పటికే డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతున్న హైదరాబాద్ కు ఈ పెట్టుబడులు మరింత వృద్ధిని తెచ్చిపెడుతాయని అన్నారు. తమ సంస్థ నెలకొల్పే అధునాతన డేటా సెంటర్ తో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య డిజిటల్ సేవల మధ్య అంతరం తగ్గుతుందని ఆరమ్ ఈక్విటీ పార్ట్‌నర్స్ సీఈవో, చైర్మన్ వెంకట్ బుస్సా అన్నారు. ఈ-సేవ, ఈ-పేమెంట్, ఈ -ఎడ్యుకేషన్ వంటి ప్రభుత్వ సేవలు అందరికీ అందుబాటులోకి వస్తాయని అభిప్రాయపడ్డారు.



# జల్సాల కోసమే మంత్రుల పర్యటనలు..

- రాష్ట్రంలో పరిపాలన ప్రారంభం కాలేదు
- జీవో 33ని వెంటనే రద్దు చేయాలి
- సుంకిశాల విషయంలో నిర్మాణ సంస్థదే బాధ్యత
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

**జనపదం, సూర్యాపేట :** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన ప్రారంభం కాలేదని, ముఖ్యమంత్రితో సహా ఏ ఒక్క మంత్రికి రాష్ట్రం పట్ల చిత్తశుద్ధి, బాధ్యత లేదని, జల్సాల కోసం మంత్రులు పర్యటనలు చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేట కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జగదీశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణకి కాళేశ్వరం జీవధార లాంటిందని, అందుకే కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణం చేశారన్నారు. రాష్ట్రంలో ఒక్క ఎకరం పంట ఎండిన కూడా ప్రభుత్వానిదే బాధ్యత అని, సర్కారుకు అన్నదాతల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న కాళేశ్వరం పంపులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సుంకిశాల నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ అని, ఉప ముఖ్యమంత్రి అవగాహన లేకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని, సుంకిశాల విషయంలో నిర్మాణ సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నార. తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసే జీవో 33 ని వెంటనే రద్దు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం, రేవంత్ గురువు చంద్రబాబును సంతృప్తి పరచడం కోసమే ఈ జీవో తెచ్చారా అనే అనుమానం కలుగుతుందన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచన చేసిందిని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారి సంక్షోభం కోరుకుంటోందని, జీవో 33 వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందని వాపోయారు. దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా న్యాయపోరాటం చేస్తామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రాజెక్టుల మీద అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, పోటీలు పడి నోరు పారేసుకుంటూ ప్రజల్లో అబాసుపాలవుతున్నారని, ముఖ్యంగా సుంకిశాల ప్రాజెక్టు ప్రమాదాన్ని వారం రోజులు దాచిపెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని జగదీష్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.



# ప్రధాని పది పైసలు ఇవ్వలే..

- తెలంగాణపై నరేంద్ర మోడీ వివక్ష
- బయ్యారం స్టీల్ ప్లాంట్ తో పెరగనున్న తలసరి వినియోగం
- విభజన హామీలు నెరవేర్చాలి
- పాండురంగ పురం మల్కాన్ గిరి స్వాగతించదగ్గదే ..
- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

**జనపదం, హైదరాబాద్:** తెలంగాణలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోడీ పది పైసలు ఇవ్వలేదని మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ ఆరోపించారు.
మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్ రెడ్డి, దిండిగాల రాజేందర్ తో కలిసి తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడారు. బడ్జెట్ కేటాయింపులు, విభజన చట్టంలో పేర్కొన్న హామీల విషయంలో తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కృషి చేయాలన్నారు. నిన్న కేంద్ర కేబినెట్ కొన్ని రైల్వే లైన్లకు అనుమతి ఇచ్చిందని వార్తలు వచ్చాయని, భద్రాచలం నుంచి మల్కాన్‌గిరి రైల్వే లైన్‌కు కూడా అనుమతి వచ్చిందన్నారు. అందులో భద్రాచలంలో రైల్వే స్టేషన్ ఎందుకు లేదని నిలదీశారు. కొత్తగూడెం నుంచి మణుగూరు వెళ్లే దారిలో పాండురంగపురం రైల్వే స్టేషన్ ఉంటుందని వినోద్ కుమార్ గుర్తుచేశారు.వాస్తవానికి పాండురంగపురం నుంచి మల్కాన్ గిరి రైల్వే లైన్ వెళ్తుందని వివరించారు. ఈ రైల్వే లైన్‌ను తెలంగాణ ఓ కోణంలో ఆలోచిస్తే.. ప్రధాని నరేంద్ర మోదీ మరో కోణంలో ఆలోచిస్తున్నారని విమర్శించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బైలదిల్లా విశాఖ కన్నా మహబూబాబాద్ జిల్లాలోని బయ్యారానికే దగ్గరగా ఉంటుందని స్పష్టం చేశారు. బయ్యారానికి రైల్వే లైన్ లేకపోవడం కూడా అక్కడ ఉక్కు ఫ్యాక్టరీ రాకపోవడానికి కారణమని అన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ నేపథ్యంలో తాజాగా ప్రతిపాదించిన పాండురంగ పురం మల్కాన్ గిరి రైల్వేలైన్ స్వాగతించదగ్గదేనని వినోద్ కుమార్ వెల్లడించారు. బయ్యారంలో 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పాదక ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలోనే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిందని, ఈ ఫ్యాక్టరీ వస్తే 4 వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయన్నారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఉక్కు పాలసీ ప్రకటించిందని గుర్తుచేశారు. కొత్త రైల్వేలైన్ ఖనిజ సంపదను గుజరాత్ తరలించేందుకు ఉపయోగపడేదిగా ఈ రైల్వేలైన్ మారకూడదని హితవు పలికారు. పాండురంగ పురం మల్కాన్ గిరి రైల్వే లైన్ దృష్ట్యా వెంటనే బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి ప్రధాని మోదీ చర్యలు చేపట్టాలని కోరారు. బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తేనే ఈ రైల్వేలైన్ తెలంగాణకు ఉపయోగపడుతుందని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

# ఇల్లు పాయె.. గుడిసె పాయె..

## సొంత ఊరోళ్లకే కేసీఆర్ పంగ నామం

- పెద్దసార్ ను నమ్ముకుంటే ఉన్నది పాయె..
- ఆయన నిర్వాకం ఇల్లు పీకి పందిరి వేసిన చందంగా ఉంది
- బేషజాలకు పోకుండా చింతమడకలో ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**జనపదం, హైదరాబాద్ :** పెద్ద సార్ మాటలు నమ్మిన ఊరోళ్లు ఉన్న ఇంటిని, గుడిసెలను కోల్పోయి రోడ్డున పడ్డారని, ఎనకట ఒకడు ఉన్న ఇల్లు పీకి పందిరి వేసినట్టుగా నిరుపేదల పరిస్థితి తయారైందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ సొంత ఊరు చింతమడక లో సీఎం హోదాలో ఐదేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తానని మాట ఇచ్చారని, పేదోళ్ల ఇండ్లన్నీ కూల్చి వేసి ఇప్పటివరకు వారికి నిలువ నీడ లేకుండా చేశారన్నారు.

**ఉన్న ఉరోళ్లకే పంగ నామాలు**

దేశానికి దశ దిశ చూపిస్తా అని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఉన్న ఉరోళ్లకే పంగ నామాలు పెట్టారని మంత్రి పొంగులేటి విమర్శించారు. చింతమడకలో ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మించి ఇస్తానని 22 జులై 2019 లో ఆర్భాటంగా ప్రకటించారని, ఆయనను నమ్మి తమ ఇళ్లను, గుడిసెలను అక్కడి నిరుపేదలు సర్కారుకు అప్పగిస్తే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం వాటిని కూల్చి వేశారన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరు 1909 లబ్ధిదారులకు అధికారులు ఇళ్లు మంజూరు చేశారని, కానీ 1215 ఇళ్లను నిర్మించడానికి మాత్రమే కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకున్నారన్నారు. మిగిలిన 694 ఇళ్లకు అగ్రిమెంట్ జరగలేదదని, పనులు కూడా ప్రారంభం కాలేదన్నారు. గత ఏడాది డిసెంబర్ నాటికి అంటే నాలుగేళ్లలో కేవలం 1103 ఇళ్లు పూర్తికాగా, 148 ఇళ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో దాదాపు 60 నుంచి 70 కుటుంబాలు ఉన్న ఇంటిని, గుడిసెలను కోల్పోయి రోడ్డున పడ్డాయని వాపోయారు. పలువురు పేదలు పొలంగట్ల దగ్గర గుడిసెలు వేసుకున్నారని, మరి కొంతమంది ఇతర ప్రాంతాలకు వలస పోయారన్నారు. ఇళ్ల కోసం ఐదేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నా వారికి ఇల్లు రాలేదని, దీనికి తోడు ఉన్న ఇల్లు పోయింది, గుడిసె పోయిందని వాపోతున్నారన్నారు.లదారులకు కేటాయించినా కొన్ని ఇళ్లకు తాళం చెవులు ఇచ్చి హ్యాండ్ ఓవర్ చేయలేదని, చేసిన ఇండ్లకు కనీస సౌకర్యాలు కల్పించలేదని పొంగులేటి ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్లు పాలించిన కేసీఆర్ కర్తవ్యాన్ని విస్మరించారని, సొంత గ్రామ ప్రజలకే పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదన్నారు. చింతమడికే అని మంత్రి పొంగులేటి అన్నారు.

**ప్రతి హామీని అమలుచేస్తాం..**

హామీలు ఇవ్వడమే కాదు ఇచ్చిన ప్రతి హామీని ఆచరణలో అమలు చేయడమే ఇందిరమ్మ రాజ్యమని పొంగులేటి స్పష్టం చేశారు. ముఖ్యంగా పేదవాడికి సొంత ఇల్లు ఒక కల అని, అది నెరవేరితే పేదవాడి ఇంట పండుగే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి మేలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని,ఇందిరమ్మ రాజ్యంలో పేదోళ్లకు పూర్తి న్యాయం జరుగుతుందని చేసి చూపెడతామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు మాత్రమే రాష్ట్ర చరిత్రలో శిలాశాసనాలు అయ్యాయన్నారు.

**పేదల మేలుకోరే సర్కారు..**

గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నేతలంతా ఫామ్ హౌజ్‌లు కట్టుకుని పేదలకు మాత్రం ఇంటి సౌకర్యాన్ని విస్మరిస్తే ఇప్పుడు మేం వారికి కూడా నివాస వసతిని కల్పిస్తున్నామని, ఇది ప్రజా ప్రభుత్వం.. పేదల మేలు కోరే ప్రభుత్వం.. అందుకే ఇందిరమ్మ రాజ్యం అని గర్వంగా చెప్పుకుంటున్నామని మంత్రి అన్నారు. తక్షణమే చింతమడకలో పర్యటించి ఇండ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఏ పేదవాడు కూడా ఇబ్బంది పడకూడదని, ఎలాంటి భేషజాలకు పోకుండా వీలైనంత త్వరగా అక్కడి ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# బీసీలు రైతు తరహా ఉద్యమం చేయాలి

- అన్ని పార్టీ జెండాలు పక్కన బెట్టి ఏకం కావాలి
- 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలి
- ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్
- ఇందిరాపార్క్ లో బీసీల సత్యాగ్రహ దీక్ష




**జనపదం, హైదరాబాద్ :** స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల సాధనకు బీసీలు జెండాలు పక్కనబెట్టి రైతు తరహాలో ఉద్యమించాలని ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. శనివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీసీ ప్రజా కుల సంఘాల ఆధ్వర్యంలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన బీసీ సత్యాగ్రహ దీక్ష జరిగింది. ఈ సందర్భంగా సాయిని నరేందర్ పాల్గొని మాట్లాడారు. గడిచిన ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజ్వేషన్లను సాధన కోసం వివిధ పార్టీల్లోని బీసీలంతా జెండాలను పక్కకు పెట్టి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గడిచిన 75 ఏండ్లుగా దోపిడీకి గురైన బీసీలు సామాజిక, ఆర్థిక, రంగాల్లో అభివృద్ధి చెందాలంటే రాజకీయ రంగ ప్రవేశం చేయాలని, త ద్వారా చట్టసభల్లో కూడా బి.సి వాటా సాధించగలమని అన్నారు. చట్టాలు చేసే చట్టసభల్లో బి.సి లకు వాటా లేనంతకాలం అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ఆలిండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజక్క మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు చేసిన చరిత్ర కలిగిన తెలంగాణలో బీసీ హక్కుల సాధన కోసం గ్రామ స్థాయి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహిళా బిల్లులో బీసీ వాటా కోసం సగభాగమైన మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వాటా కోసం గల్లిలో, చట్టసభల్లో వాటా కోసం ఢిల్లీలో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘాల కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ బీసీలకు రాజకీయ అవకాశాలు లేకపోవడం వల్లే అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని వాపోయారు. పల్లె నుండి పార్లమెంటు వరకు అన్ని స్థాయిల్లో బీసీలకు రాజకీయ అవకాశాలు దక్కేందుకు దేశవ్యాప్త ఉద్యమం చేయాలని అన్నారు. ఈబీసీ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా దక్కాలంటే రాజకీయ అధికారం తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశర్లు, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్, ఆలిండియా ఓబీసీ జాక్ రాష్ట్ర నాయకులు ఏటిగడ్డ అరుణ, అశోక్ పోశం, చాపర్తి కుమార్ గాడ్గే, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు గౌరీ శంకర్, వివిధ సంఘాల నాయకులు కేవీ గౌడ్, పిడికిలి రాజు, కృష్ణ, పులి రంజిత్ గౌడ్, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, దాసోజు లలిత, నితిన్, వీరాస్వామి, బుద్దే వెంకన్న, అశోక్ యాదవ్, చెన్న మధు, కుసుమ లక్ష్మీనారాయణ, నయీం, ప్రణయ్ గౌడ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# ప్రజాపాలన అప్లికేషన్లు గాయబ్..?

- పరిష్కారం చూపని కార్యక్రమం
- ఆందోళనలో దరఖాస్తుదారులు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



**జనపదం, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో ప్రజలు క్యూలైన్లో గంటలకొద్దీ నిల్చొని.. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సమర్పించిన దరఖాస్తులు గాయబ్ అవుతున్నాయి. ప్రభుత్వం గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన దరఖాస్తులను తీసుకున్నది. 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయని వెల్లడించిన సర్కారు మరుసటిరోజు నుంచే మండల కేంద్రాలు, మున్సిపాలిటీల వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రారంభించారు. 1.25 కోట్ల దరఖాస్తుల డాటా ఎంట్రీకి ప్రభుత్వం 10 రోజుల సమయమే ఇచ్చింది. కొన్నిచోట్ల దరఖాస్తులను ఇండ్లకు పంపించి డాటా ఎంట్రీ చేయించారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో బైక్‌పై తీసుకెళ్తుండగా పత్రాలన్నీ రోడ్డుపై పడిపోయాయి.ఈ ఘటనలో టీం లీడర్‌పై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఇదేరీతిన కుత్బుల్లాపూర్‌లో జరిగిన విషయంలో మాత్రం టీం లీడర్‌కు నోటీసు ఇచ్చి సరిపెట్టడం కూడా యంత్రాంగాన్ని విస్మయానికి గురి చేస్తున్నది.

**అనుమానాలు**

ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ 12వ తేదీకే పూర్తయినట్టు అధికారులు ప్రకటించారు. ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తేగా, ఫిబ్రవరి ఒకటిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించగా అధికారులు 1,09,01,255 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. 2.82 లక్షల దరఖాస్తులకు ఆధార్, రేషన్ నంబర్ జతచేయలేదని, వివరాలు తప్పుగా రాశారని చెప్పారు. వీటిని కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, అర్హులైతే పథకాలు వర్తింపజేయాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తుల సంఖ్య 1.25 కోట్ల నుంచి 1.09 కోట్లకు పడిపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నకిలీ దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నా.. సుమారు 13 లక్షల అప్లికేషన్లు తగ్గాయి.

**దరఖాస్తు నమోదు కాలేదు**


ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, రూ.500కే ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభించినా వర్తించకపోవడంతో బాధితులు విద్యుత్తు గ్యాస్ కార్యాలయాలకు పరుగులు తీశారు. అధికారులు వెబ్ పోర్టల్‌లో తనిఖీ చేసి 'మీ పేరు లేదు' అంటూ సమాధానం ఇచ్చారు. మండల కార్యాలయాలకు వెళ్లినా అదే సమాధానం. అప్పటినుంచి బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మండల స్థాయి నుంచి ప్రజాభవన్ వరకు ప్రజావాణిలో దరఖాస్తులు ఇచ్చినా పరిష్కారం కావడంలేదని వాపోతున్నారు.

**వివరాలన్నీ గుట్టుగా..**

ప్రజాపాలన దరఖాస్తులపై ప్రభుత్వం మొదటి నుంచీ వివరాలు వెల్లడించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రజాపాలన ఆధారంగా గృహలక్ష్మి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్న ది. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎంతమందికి అమలు చేస్తున్నారు? వంటి వివరాలేవీ బహిర్గతం చేయడం లేదని చెప్తున్నారు. దరఖాస్తులకు, అమలుకు మధ్య భారీగా వ్యత్యాసం ఉండటం వల్లే దాచి పెడుతున్నారని విమర్శిస్తున్నారు.

# తెలంగాణకు కొత్త రైల్వే లైన్..

- రూ. 24,657 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్ట్
- మల్కన్‌గిరి నుంచి భద్రాచలం వరకు రూ.4,109 కోట్లతో కొత్త లైన్
- ఈశాన్య రాష్ట్రాలకు కనెక్టివిటీ పెరిగే చాన్స్
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హర్షం



**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ మీదు గా కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర కే బినెట్ ఆమోదం తెలపడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజ య్ హర్షం వ్యక్తం చేశారు. రైల్వే నెట్‌వ ర్క్‌ను బలోపేతం చేయాలన్న ప్రధాని మోదీ సంకల్పానికి ఈ నిర్ణయం నిదర్శన మన్నారు. శుక్రవారం ప్రధాని అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, బీహార్, ఒడిశా, మహారాష్ట్ర సహా పశ్చిమ బెంగా ల్‌లోని 7 రాష్ట్రాల్లోని 14 జిల్లాలను కవర్ చేసే 8 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.

**రూ.24,657 కోట్ల అంచనా..**

లంగాణ మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదంపై బండి సంజయ్ శనివారం స్పందించారు. రూ.24,657 కోట్ల అంచనా వ్యయంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహా రాష్ట్ర, జార్ఖండ్, బీహార్, పశ్చిమ బెం గాల్‌లలో ఈ కొత్త రైల్వే లైన్లను ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఇందులో భాగంగా ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి భద్రాచలంలోని పాండురంగాపురం వరకు రూ.4,109 కోట్లతో 200.60 కి.మీ పొడవున కొత్త లైన్‌ను నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే ఏపీ, తెలంగాణ నుంచి తూర్పు, ఈశాన్య రాష్ట్రాలకు రైల్వే కనెక్టివిటీ పెరుగుతుందని అన్నారు.



# 24 గంటలు అందుబాటులో ఉంటా..

- జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు చేపట్టాలి
- థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో 17 రోజుల ఉత్పత్తికి సరిపడా నిల్వలు
- నిర్దేశిత లక్ష్యాల సాధనకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- వారానికోసారి నివేదిక పంపాలని చీఫ్ ఇంజినీర్లకు ఆదేశాలు

**జనపదం, బ్యూరో :** సమస్యల పరిష్కారానికి 24 గంటల పాటు నేను అందుబాటులో ఉంటానని డిప్యూటీ సీఎం, విద్యు త్ శాఖ మంత్రి అధికారులు, సిబ్బందికి భరోసా ఇచ్చారు. శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో థ ర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పాదనకు సం బంధించిన ఆ శాఖల సీఈలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారు లకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ కృష్ణ, గోదా వరి పరివాహక ప్రాంతాలతో పాటు ఇత ర ప్రాంతాల్లో నమోదవుతున్న వర్షపాతాలను దృష్టిలో పెట్టుకొని జల విద్యుత్ కేంద్రాల్లో గరిష్ట ఉత్పత్తిని సాధించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. థర్మల్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి ప్లాంట్ లో కనీసం 17 రోజుల విద్యుత్ ఉత్పాదనకు సరిపడా బొగ్గు నిల్వలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని, నిర్లక్ష్యం, అలసత్వానికి తావు లేదని స్పష్టం చేశారు. 24/7 పనిచేసే అత్యవసర శాఖ విద్యుత్ శాఖ అని అన్ని స్థాయిలోని అధికారులు, సిబ్బంది గుర్తుంచుకోవాలన్నారు. ఎవరికైనా సమస్యలు ఉంటే వినేందుకు, వాటిని పరిష్కరించేందుకు 24 గంటల పాటు అందుబాటులో ఉంటానని అధికారులు, సిబ్బందికి భరోసా ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సకాలంలో ని ర్ణయాలు తీసుకోకపోవడం వల్లే గతం లో శ్రీశైలం, జూరాల వంటి హైడల్ వి ద్యుత్ ప్రాజెక్టుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, తద్వారా ఏర్పడిన నష్టాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అలాంటి పరిస్థితి పునరావృతం కావొద్దని స్పష్టం చేశారు. ప్రాజెక్టులకు సంబంధిం చి సీఈలు నిర్లక్ష్యం వహించినట్లుగా ఉం టే రాతపూర్వకంగా వారి నుంచి వివరణ తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సల్తానియా, ట్రాన్స్ కో జేఎండీ శ్రీనివాస్, ఎమర్జెన్సీ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జెన్కో డైరక్టర్లు, సీఈలు తదితరులు పాల్గొన్నారు.


# డార్క్ వెబ్ నుంచి డ్రగ్స్..

- డెలివరీ చేస్తుండగా పట్టుకున్న పోలీసులు
- హైదరాబాద్‌లో మరో డ్రగ్స్ ముఠా అరెస్ట్..

**జనపదం, క్రైంబ్యూరో:** రాష్ట్రంలో మాదక ద్రవ్యాలను పోలీసులు ఎంతకట్టడి చేస్తున్నా..ఏదో ఓ చోట ఇంకా డ్రగ్స్ మాట వినిపిస్తూనే ఉంది. కొంతమంది అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని చెడు వ్యసనాలకు ఉపయోగిస్తున్నారు. డార్క్‌వెబ్ ద్వారా డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ టెకీని తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అతని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే ఓ వ్యక్తి మాదక ద్రవ్యాలను డార్క్ వెబ్ ద్వారా ఆర్డర్ చేస్తున్నాడనే సందేహం కలిగి అతడి కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. జూలై 31వ తేదీన డార్క్ వెబ్ ద్వారా రాష్ట్రానికి డ్రగ్స్ వస్తున్నట్లు పక్కా సమాచారంతో అతనిపై దృష్టి పెట్టారు. అసోం నుంచి స్పీడ్ పోస్టులో ఖమ్మం జిల్లాకు మత్తు పదార్థాలు వస్తున్నట్లుగా సమాచారం తెలుసుకున్నారు. ఈ నెల 8న డ్రగ్స్ డెలివరీ చేస్తున్న క్రమంలో టీజీ న్యాబ్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

## డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

మరో కేసులో గుట్టుచప్పుడు కాకుండా లగేజీ బ్యాగులో తరలిస్తున్న డ్రగ్స్‌ను హైదరాబాద్‌లో డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నగరం నుంచి న్యూజిలాండ్‌కు ఇద్దరు వ్యక్తులు భారీగా మాదకద్రవ్యాలు తరలించేందుకు యత్నించగా, పక్కా సమాచారంతో అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిందితుల వద్ద నుంచి 3 కిలోల ఎఫెడ్రిన్, సూడోఎఫెడ్రిన్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నిందితులు లగేజీ బ్యాగులో ప్రత్యేకంగా డ్రగ్స్ ప్యాకెట్లను అమర్చి న్యూజిలాండ్‌కు కొరియర్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.



# భవిష్యత్ కార్యాచరణపై బీజేపీ ఓబీసీ మోర్చా సమావేశం

**జనపదం, హైదరాబాద్:** బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఇంచార్జ్ సహా ఇంచార్జ్ ల సమావేశం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షు డు ఆనంద్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీ జేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశం వెంకటేశ్వర్లు పాల్గొని, ఓబీసీ మోర్చా నా య కులు అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్తులో బీజేపీలో బీసీల పాత్ర, బీసీల అవసరాలపై పోరాటం అనే అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమం లో ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శులు నందనం దివాకర్. ఎన్న ఈశ్వర్పప్ప, సీనియర్ నాయకులు సదానంద్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు సంజయ్ గణతే, చీర సత్యనారాయణ, మహేష్ యాదవ్, ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేష్, జిల్ల ఇంచార్జులు, సహా ఇంచార్జులు పాల్గొన్నారు.



# స్టెప్పులేసిన హాకీ ప్లేయర్లు..

**▫ ఢిల్లీ గ్రాండ్ వెలకమ్..**

**జనపదం, ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం ముద్దాడిన భారత పురుషుల హాకీ జట్టు శనివారం ఢిల్లీ చేరుకుంది. వీరి రాక విషయం తెలిసిన ఫ్యాన్స్ ఉదయం నుంచే ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకొని ప్లేయర్లకు ఘన స్వాగతం పలికారు. అటు అధికారులు బ్యాండ్ చప్పుళ్లుతో జట్టు సభ్యులకు గ్రాండ్ వెల్‌కమ్ ఏర్పాటు చేశారు. ఇక సంతోషంలో ప్లేయర్లు బ్యాండ్ చప్పుళ్లకు హుషారుగా స్టెప్పులేశారు. ఇక కాంస్యం నెగ్గి పారిస్ నుంచి భారత్‌కు వస్తున్న టీమ్‌ఇండియా ప్లేయర్లకు విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కూడా ప్రత్యేక అభినందనలు తెలిపింది. ప్లేయర్లు ప్రయాణించిన ఫ్లైట్‌లో 'ఇండియా హాకీ టీమ్‌కు శుభాకాంక్షలు' అని వాయిస్ అనౌన్స్‌మెంట్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఇక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా దేశంలోని ప్రముఖులు, సెలబ్రిటీలు సైతం హాకీ జట్టుపై ప్రశంసల జల్లు కురిపించారు.

# 10 గంట్లో 4.6 కేజీలు తగ్గాడు..

**57 కేజీల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్యం**

**కఠోర శ్రమతో.. బరువుతగ్గిన అథ్లెట్..**

**జనపదం, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ 57 కేజీల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ శుక్రవారం కాంస్య సాధించాడు. అయితే కాంస్యం ముద్దాడిన అమన్ సెహ్రావత్ పోటీకి ముందు ఉండాల్సిన (57 కేజీలు) దానికంటే అధిక బరువున్నాడు. రీసెంట్‌గా వినేశ్ ఫొగాట్ ఇదే కారణంతో డిస్‌క్వాలిఫై అవ్వడం వల్ల అమన్‌పై కూడా అనర్హత వేటు పడుతుందేమోనని ఉత్కంఠ నెలకొంది. కానీ, అమన్ సెహ్రావత్ విషయంలో మేనేజ్‌మెంట్ జాగ్రత్తలు తీసుకుంది. గురువారం జరిగిన సెమీస్‌లో ఓడిన తర్వాత అమన్ బరువు 61.5 కేజీలు ఉందట. దీంతో అమన్ బరువుపై శ్రద్ధ తీసుకున్నాడు. కాంస్య పోరు (శుక్రవారం రాత్రి) నాటికి 57 కేజీలకు తగ్గడానికి కఠినంగా శ్రమించాడు. కేవలం 10 గంటల వ్యవధిలోనే ఏకంగా 4.6కేజీలు తగ్గాడు. దానికోసం సీనియర్ కోచ్‌లు జగమందర్ సింగ్, వీరేందర్ దహియాతోపాటు మరో ఆరుగురి బృందం కష్టపడింది. కాంస్య పోరుకు ముందు శుక్రవారం ఉదయం అమన్ బరువును తూచారు. సరిగ్గా 10 గంటల సమయం మాత్రమే ఉంది. భారత బృందం అమన్‌ను గంటపాటు వేడినీళ్ల స్నానం, ఆగకుండా గంటసేపు ట్రెడ్‌మిల్‌పై రన్నింగ్ చేయించి జిమ్‌కు తీసుకెళ్లారు. అక్కడ కఠినమైన కసరత్తులు చేయించారు. మళ్లీ 30 నిమిషాల బ్రేక్ ఇచ్చారు. దాదాపు ఐదు సెషన్లపాటు ఐదేసి నిమిషాల చొప్పున సానా బాత్ చేయించారు. చివరి సెషన్ సమయానికి 900 గ్రాములు అధిక బరువు ఉన్నట్లు కోచ్‌లు గుర్తించారు. దీంతో నెమ్మదిగా జాగింగ్ చేయమని అమన్‌కు సూచించారు. ఇలా 15 నిమిషాలు చేయించారు. అప్పుడు సమయం శుక్రవారం ఉదయం 4.30 గంటలు. అప్పటికి అమన్ బరువు 56.9 కేజీలకు చేరాడు. అంటే తాను పోటీ పడిన వెయింట్ (57కేజీలు) కంటే 100గ్రాములు తక్కువే ఉన్నాడు. దీంతో భారత బృందం ఊపిరి పీల్చుకుంది. ఈ సమయంలో నిద్ర కూడా పోలేదని అమన్ తెలిపాడు. రెజ్లింగ్‌కు సంబంధించిన వీడియోలు చూస్తూ ఉండిపోయినట్లు చెప్పాడు.



# నాకు ఉద్యోగం వద్దు..

**▫ షూటింగ్ పైనే శ్రద్ధ పెడుతా..**
**▫ కాంస్య పతకంతో మెరిసిన షూటర్ సరబ్‌జోత్ సింగ్**



**జనపదం, స్పోర్ట్స్:** ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన షూటర్ సరబ్‌జోత్ సింగ్ భవిష్యత్తును పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నాడు. ఇకపైన కూడా షూటింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టేందుకు భారీ ఆఫర్‌ను సైతం వదులుకున్నాడు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సరబ్‌జోత్ తిరస్కరించాడు. దీంతో సర్కార్ కంగుతిన్నది. పారిస్ వేదికగా జరుగుతున్న విశ్వ క్రీడల్లో సరబ్‌జోత్ సింగ్ పతకం సాధించిన విషయం తెలిసిందే. వ్యక్తిగత విభాగంలో నిరాశపరిచిన అతడు.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మను భాకర్ తో కలిసి కంచు మోత మోగించాడు. దీంతో ఒలింపిక్స్‌లో మెడల్ గెలవాలనే కలను నిజం చేసుకున్నాడు. దేశ ప్రతిష్టతో పాటు రాష్ట్ర పరపతిని పెంచిన ఈ ఒలింపిక్ విజేతకు పంజాబ్ ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామంటూ ప్రకటించింది. రాష్ట్ర స్పోర్ట్స్ విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించేందుకు సర్వం సిద్ధం చేసింది. మరెవరైనా అయితే ఎగిరి గంతేసేవారు. కానీ, సరభ్‌జోత్ మాత్రం ఆ జాబ్‌ను సున్నితంగా తిరస్కరించాడు. 'వాళ్లు ఉద్యోగం ఇస్తామన్నందుకు చాలా సంతోషంగా ఉంది. అయితే.. ఇప్పుడు నా దృష్టంతా షూటింగ్ మీదే ఉంది. జాబ్ గురించి తర్వాత ఆలోచిస్తాను' అని సరబ్‌జోత్ సింగ్ బదులిచ్చాడు.



# పోరాడి ఓడిన రితికా..

**▫ రెజ్లింగ్ లో చేజారిన మరో పతకం..**

**జనపదం, స్పోర్ట్స్:** ఒలింపిక్స్ బరిలో ఉన్న ఆఖరి రెజ్లర్ రితికా హుడాకు చుక్కెదురైంది. మహిళల 76 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో ఆమె పోరాటం క్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. శనివారం జరిగిన బౌట్‌లో కిర్గిస్థాన్‌కు చెందిన టాప్ సీడ్ ఐపెరి మెడెట్ కిజీ చేతిలో రితికా ఓటమి పాలైంది. తొలి రౌండ్‌లో 1–0తో ఆధిక్యం కనబరిచిన ఆమె ఆ తర్వాత కూడా జోరు చూపింది. ఐపెరి సైతం ఓ పాయింట్ సాధించగా 1–1తో స్కోర్ సమం అయింది. అయితే.. అనూహ్యంగా జడ్జిలు ఐపెరిని విజేతగా ప్రకటించారు. ఆరు నిమిషాల పాటు జరిగిన బౌట్‌లో చివరి టెక్నికల్ పాయింట్ సాధించిన ఆమెను సెమీస్‌కు వెళ్లింది. దాంతో, రితిక 3–1తో ఓడి సెమీస్ ఛాన్స్ చేజార్చుకుంది.

# పెండ్లి చేసుకున్న యువ క్రికెట్ జితేశ్

**ఇన్ స్టాలో పిక్స్ పోస్ట్ చేసిన క్రికెటర్**





**జనపదం, స్పోర్ట్స్:** భారత యువ క్రికెటర్ జితేశ్ శర్మ పెండ్లి చేసుకున్నాడు. టీ20 స్పెషలిస్ట్‌గా పేరొందిన జితేశ్ శుక్రవారం దాంపత్య జీవితం ఆరంభించాడు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన షలక షలక ముకేశ్వర్‌ను జితేశ్ మనువాడాడు. ఈ యువ జంట పరిణయం కుటుంభసభ్యుల సమక్షంలో ఆద్యంతం సంప్రదాయంగా, వైభవంగా జరిగింది. వారి పెండ్లి వేడుక ఫొటోలను జితేశ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. 'ఈ క్రేజీ ప్రపంచంలో 8.8.8న మనం ఒకరికొకరం దొరికాం' అంటూ ఆ ఫొటోలకు జితేశ్ క్యాప్షన్ రాశాడు. ఇంకేముంది క్షణాల్లో ఈ వధూవరుల ఫొటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఆల్‌రౌండ్ శివం దూబేలతో పాటు పలువురు ఐపీఎల్ ఆటగాళ్లు జితేశ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐపీఎల్‌తో వెలుగులోకి వచ్చిన యువ ఆటగాళ్లలో జితేశ్ ఒకడు. వికెట్ కీపర్, పవర్ హిట్టర్‌గా పేరొందిన ఈ యువకెరటం పంజాబ్ కింగ్స్ తరఫున అద్భుతంగా ఆడాడు. దాంతో, అందరూ ఊహించినట్టుగానే టీమిండియాకు ఎంపిక య్యాడు. వన్డే వరల్డ్ కప్ తర్వాత బ్యాకప్ వికెట్ కీపర్‌గా దక్షిణాఫ్రికా పర్యటనక వెళ్లాడు.

## CINEMA NEWS సినిమా పదం



# శోభిత-చై ఫ్యామిలీ పిక్స్ వైరల్

అక్కినేని వారసుడు స్టార్ హీరో నాగ చైతన్య శోభిత ధూళిపాళ్ల అనే తెలుగు హీరోయిన్‌ను పెళ్లి చేసుకోబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే వీరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. అయితే ఈ ఏంగేజ్‌మెంట్ జరిగిన రోజు నాగార్జునతో పాటు నాగ చైతన్య శోభిత ధూళిపాళ్ల ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి. తాజాగా నిశ్చితార్థం జరిగిన రోజు హాజరైన అక్కినేని ఫ్యామిలీతో పాటు శోభిత ఫ్యామిలీ శోభిత తల్లిదండ్రులు వేణు గోపాల్ రావు, శాంతి కామాక్షి ఫొటోలను అక్కినేని టీం సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇక ఈ ఫొటోలలో నాగార్జున రెండో భార్య అమలతో పాటు అఖిల్, మాజీ భార్య లక్ష్మి దగ్గుబాటి తదితరులు హాజరయ్యారు. అయితే ఈ ఏంగేజ్‌మెంట్‌కు దగ్గుబాటి ఫ్యామిలీ నుంచి ఎవరు హాజరుకాలేదని సమాచారం. వీరి పెళ్లి ఈ యేడాది కార్తీక మాసంలో జరగనున్నట్టు వార్తలు వస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక శోభితా తల్లిదండ్రుల విషయానికొస్తే.. తండ్రి వృత్తి రీత్యా నేవీ ఆఫీసర్ కావడంతో వీళ్ల కుటుంబం విశాఖకు షిఫ్ట్ అయింది. అక్కడ లిటిల్ ఏంజెల్ స్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్ లో చదువుకుంది. ఆ తర్వాత వీళ్లు ముంబైకు షిఫ్ట్ అయ్యారు. అక్కడే శోభితా హయ్యర్ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది.



# 12న కంగువా ట్రైలర్

**కోలీవుడ్ స్టార్ హీరో సూర్య** ప్రధాన పాత్రలో బాలీవుడ్ నటి దిశా పటాని హీరోయిన్ గా దర్శకుడు శివ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం "కంగువా".ఈ మూవీ ఒక్క సూర్య కెరీర్ లోనే కాకుండా మొత్తం తమిళ సినిమా నుంచి కూడా ఒక బిగ్గెస్ట్ బడ్జెట్ సినిమాగా రాబోతుంది. అయితే ఈ సినిమాని కూడా మేకర్స్ రెండు భాగాలుగా ప్లాన్ చేస్తుండగా ఈ చిత్రం నుంచి ఒక స్పెషల్ అప్డేట్ ని మేకర్స్ అందించారు. దీనితో ఈ సినిమా ట్రైలర్ ని ఏకంగా రెండు నెలల ముందే విడుదల చేస్తున్నట్టుగా సాలిడ్ అప్డేట్ అందించారు. సాధారణంగా ఏ భారీ సినిమా అయినా ఇప్పుడు ట్రెండ్ లో సరిగ్గా ఒక్క నెల ముందు ట్రైలర్ ని రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. కానీ ఈ సినిమా



మేకర్స్ మాత్రం రెండు నెలల ముందే ట్రైలర్ వదులుతుండడం విశేషం. ఇక ఈ చిత్రం అక్టోబర్ 10న థియేటర్స్ లోకి రానుండగా దీనికి రెండు నెలల ముందే ఈ ఆగస్ట్ 12న ట్రైలర్ ని రిలీజ్ చేస్తున్నట్టుగా సూర్యపై ఒక పవర్ఫుల్ పోస్టర్ తో అనౌన్స్ చేశారు. ఇది మాత్రం క్రేజీ లెవెల్లో ఉందని చెప్పాలి.



# చుట్టమల్లె.. అందాలు..

దివంగత తార శ్రీదేవి కూతురు జాన్వీ కపూర్ తన అందచందాలతో యూత్‌ను ఫిదా చేస్తోంది. తెలుగు కుర్రాళ్ల గుండెల్లో గూడు కట్టుకోవడానికి స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఎందుకంటే ఇప్పుడీ భామ దేవర సినిమాతో టాలీవుడ్‌లోకి సాలిడ్ ఎంట్రీ ఇవ్వనుంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో పల్లెటూరి భామగా కనిపించనుంది. తన నటనతో పాటు గ్లామర్ డోస్‌తో ఆడియెన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేయనుంది. తాజాగా ఈ మూవీ నుంచి చుట్టమల్లె అనే ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. విజువల్ వండర్‌గా ఇది తెరకెక్కింది. ఇందులో ఈ భామ తన అందమంతా ఆరబోసి ఎన్టీఆర్‌తో రొమాన్స్ చేసింది. అలాగే తన అందాలతో కుర్రకారును కూడా తెగ ఆకట్టుకుంది. ఈ సాంగ్ రిలీజై రోజులు గడుస్తున్నా యూత్ మాత్రం ఆ సాంగ్‌ను అస్సలు వదలట్లేదు. అందరూ ఈ సాంగ్ మేనియాలోనే ఊగిసలాడుతున్నారు. ఇప్పటి వరకు 50 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుంది. యూట్యూబ్ ట్రెండింగ్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే జాన్వీ కూడా ఈ సాంగ్‌కు స్లోగా అడిక్ట్ అయిపోయిందట. ఈ విషయాన్ని ఆమెనే సోషల్ మీడియాలో తెలియజేస్తూ ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఈ సాంగ్ హిందీ వెర్షన్‌కు ఓ రీల్ చేసి వదిలింది. ఈ రీల్‌లో జాన్వీ తన అందంతో మా అభిమానుల గుండెల్ని చుట్టేస్తోంది అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఇందులో జాన్వీ గౌన్ ధరించి ఎంతో కూల్‌గా, అందంగా కనిపించింది.

# అవతార్-ఫైర్ అండ్ యాష్



**టైటానిక్**, అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ సినిమా ల దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్ అవతార్ సినిమాకు సీక్వెల్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఇప్పటికే ఈ ఫ్రాం చైజీ నుంచి అవతార్, అవతార్ ది వే ఆఫ్ ది వాటర్ చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీ నుంచి మూడో భాగం రానున్నట్లు ఒక ఈవెంట్‌లో వెల్లడించాడు. అవతార్ మూడో భాగం అవతార్– ఫైర్ అండ్ యాష్ అనే పేరుతో రాబోతున్నట్లు ప్రకటించాడు. ఈ సినిమాను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 19 2025న విడుదల చేయ నున్నట్లు వెల్లడించాడు. మొదటి భాగంలో గాలి, రెండో భాగంలో నీటిని మూడో భాగంలో నిప్పును ఇలా పంచభూతాల కాన్సెప్ట్‌ను ప్రధాన అంశంగా తీసుకుని సినిమా ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక అవతార్ 2 అయితే ప్రపంచవ్యాప్తంగా 160 భాషల్లో సుమారు 55 వేలకుపైగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైంది. సామ్ వర్తింగ్‌టన్, జోయ్ సాల్డన, కేట్ విన్స్‌లెట్, స్టీఫెన్ లాంగ్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటించారు.

# 'ముఫాసా' ది లయన్ కింగ్

**లైవ్ యాక్షన్**, యానిమేషన్ మూవీ అంటే ముందుగా గుర్తొచ్చేది 'ది లయన్ కింగ్'. 1994లో వచ్చిన' ది లయన్ కింగ్' యానిమేటెడ్ క్లాసిక్ నవల్ ఆధారంగా వచ్చిన ఈ చిత్రం హాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. అయితే ఈ సినిమాకు ప్రీక్వెల్ వస్తున్న విషయం తెలిసిందే. 'ముఫాసా: ది లయన్ కింగ్' అంటూ ఈ సినిమా రానుంది. ఇప్పటికే టీజర్ విడుదల చేసిన మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను వదిలారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. మొదటి రెండు పార్ట్‌లలో అడవికి రాజుగా ఉన్న ముఫాసా తన రాజ్యాన్ని కాపాడుతూ ఉండడం అతడికి సింబా అనే కుమారుడు జన్మించడం చూడవచ్చు. అయితే ఈ ప్రీక్వెల్‌లో ముఫాసా అడవికి రాజుగా అసలు ఎలా ఎదిగాడు అతడి సోదరుడు టాకా ఎలా చనిపోయాడు అనే విషయాలు చూపించబోతున్నట్లు తెలుస్తుంది. అద్భుతమైన విజువల్స్‌తో యాక్షన్ అడ్వెంచర్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఆరోన్ స్టోన్, కెల్విన్ హ్యారిసన్ జూనియర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అకాడమీ అవార్డ్ విజేత బేరీ జెంకిన్స్ దర్శకుడు. ఇక ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# మట్కా ఫస్ట్ లుక్

మెగా హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. 2019లో ఆయన నటించిన గద్దలకొండ గణేష్ తర్వాత వచ్చిన గని, F3, గాండీవధారి అర్జున, ఆపరేషన్ వాలెంటైన్ చిత్రాల్లో ఒక్క సినిమా కూడా ఆయనకు అనుకున్న హిట్ అందించలేకపోయింది. అయితే వరుణ్ తేజ్ ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న పాన్ ఇండియా సినిమా మట్కా పైనే ఉన్నాయి. మట్కాతో హిట్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి రావాలని చూస్తున్నాడు. పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ఆగస్టు 11న ఉదయం 11.07 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 1958-1982 మధ్య కాలంలో దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన ఒక వాస్తవ సంఘటనను ఆధారం చేసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపింది. వైజాగ్ నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో వరుణ్ నాలుగు భిన్న గెటప్పుల్లో కనిపించనున్నారు. ఇప్పటికే సగ భాగానికి పైగా చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు తెలుస్తోంది.